క్లుప్తంగా

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ

సామర్లకోట: ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరణ చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జీఓ 134 ప్రకారం ఈ ఏడాది జూన్ 30కి ముందుకు అనాధికార లేఅవుట్లలో ప్లాటు కొనుగోలు చేస్తే ఈనెల 26వ తేదీ నుంచి 0 రోజులలో ఆన్‌లైన్ ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ జీఓ ప్రకారం, పీనలైజే షన్ చార్జీలు, స్థలానికి 14శాతం మార్కెట్ విలువ ప్రకారం చార్జీలు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకొవాలన్నారు. ఇతర వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని 95730 71775కు సంప్రదించాలన్నారు.

పొలంబడిపై అవగాహన



యండపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీ

కొత్తపల్లి: పొలంబడి కార్యక్రమంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్‌ఏలదేనని నియోజకవర్గ ఏడీ స్వాతి తెలిపారు. యండపల్లిలో మంగళవారం పొలంబడిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ముఖ్య ఉద్దేశం రైతులకు చేకూరే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జోగిరాజు వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

మోహనరావు సేవలు చిరస్మరణీయం



మోహనరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

పిఠాపురం: మాజీ మంత్రి కొప్పన మోహనరావు రాజకీయంగా, సామాజికంగా ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నేతలు అన్నారు. ఆయన స్వగ్రామం పిఠాపురం మండలం మాల్లంలో ఆయన 5వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సర్పంచ్ సూరిబాబు, ఆయన కుమారుడు కొప్పన శివనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు మోహనరావు విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పన సోమరాజు, మేళం శ్రీనివాస్ రావు, దుర్లపూడి సత్తిరాజు, గ్రామ పెద్దలు కొప్పన కొండలరావు, బుర్ర సతీష్, బోనసుల శివ, ములికే దివాణం, బొజ్జ సోమరాజు, జీవీ గణేష్ మోహనరావు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్‌తో అతిసార నివారణ

కాకినాడ రూరల్: చక్కెర, ఉప్పు కలిపిన నీటిని తాగించడం వలన అతిసారం నుంచి కాపాడుకోచ్చని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. అతిసారం నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి, వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ విరోచనాలు, వాంతులు కారణంగా శరీరంలోని నీరు కోల్పోయిన వ్యక్తికి ఇచ్చే ఓఆర్ఎస్ ద్రావణంలో సోడియం, పొటాషియంతో పాటు చక్కెర లవణాలు ఉండి నీరసపడకుండా కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రెడ్నం రాజా, డాక్టరు వేదుల శిరీష, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం పాట్లు

- ఎన్‌టీఆర్ కాలనీలో నాలుగు రోజులుగా అందని తాగునీరు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



కిలోమీటర్ దూరం వెళ్లి మంచినీటిని తెచ్చుకుంటున్న కాలనీవాసులు



పెద్దాపురం ఎన్‌టీఆర్ కాలనీ ముఖద్వారం



పైపులైన్ లీకై వృథాగా పోతున్న మంచినీరు

పెద్దాపురం: గుక్కెడు నీళ్ల కోసం ఆ పట్టణ ప్రజల ఎదురుచూస్తున్నారు. చుక్క నీరు కోసం నాలుగు రోజులుగా అల్లాడిపోతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధి ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప తాగునీరు మాత్రం అందించడంలేదని వారు వాపోతున్నారు. ఇది ఎక్కడో కాదండీ జిల్లా నడిబొడ్డు పెద్దాపురం పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీ ప్రజల అవస్థలు. పట్టణంలో పైపులైన్లు మరమ్మతులు, ట్యాంక్ లీకుల పేరుతో గత నాలుగు రోజులుగా పెద్దాపురం పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీ ప్రజలకు చుక్క నీరందక ఇక్కట్లు పడుతున్నారు.

స్థానిక జగ్గంపేట రహదారిలోని ఎన్‌టీఆర్ కాలనీల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే మా కాలనీకి అన్ని వసతులు వచ్చేస్తాయనుకున్న కాలనీ వాసులకు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరమైన దాఖలాల్లేవు. ఎక్కడా చూసినా అపారిశుధ్యం, మంచినీటి పైపులైన్ల లీకులు, అపార్ట్‌మెంట్లు శిథిలం వంటి భయాందోళన మధ్య కాలనీవాసులు జీవనం సాగిస్తున్నారు. కాలనీలో కనీస వసతులు కల్పించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పారిశుధ్య నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో మంచినీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం, రాత్రి అయితే కటిక చీకటిలో జీవనం సాగించాల్సి వస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం నీటి వృథా

కాలనీలోని అపార్ట్‌మెంట్‌లలో ఎక్కడికక్కడే వాటర్ ట్యాంకులు లీకు కావడంతో నీరు వృథా అవుతోంది. ఉదయం ఏడు గంటలకు మున్సిపల్ వాటర్ పంపిణీ చేసేటప్పటికి ప్రతీ అపార్ట్‌మెంట్‌లో ఏదో బ్లాక్ నుంచి పైపులైన్లు పగలడంతో మంచినీరు మురుగు కాలువల్లోకి చేరుతుంది తప్ప ప్రజలకు ఉపయోగకరంగా లేకపోవడంతో అక్కడి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధింత ఇంజినీరింగ్ అధికారులు మంచినీటి పైపులైన్ల లీకులపై దృష్టి సారించాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా కాలనీకి రావాల్సిన మంచినీటి సరఫరా పూర్తిగా కకపోవడంతో కాలనీ వాసులు నాలుగు రోజుల నుంచి గుక్కెడు నీటికి కరువయ్యారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఎన్‌టీఆర్ కాలనీలో ఇక్కడి వారందరం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీస వసతులు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా సక్రమంగా లేక నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అపార్ట్‌మెంట్‌లో చాలా వరకు అసలు ఓనర్లు లేకపోవడంతో అద్దెకు ఉండే వాళ్ల ప్లాట్లను శుభ్రంగా ఉంచడం లేదు. దీంతో అధికారులు కూడా కాలనీ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకపోవడంతో ఇక్కడ ప్రజలకు సమస్యలు ఎక్కువయ్యాయి.

– అక్షింతల గంగాధర్, స్థానికుడు

పలుమార్లు కౌన్సిల్‌లో చర్చించా..



కాలనీ సమస్యలపై ప్రతి నెలా కౌన్సిల్ సమావేశంలో చర్చించా. రెండు రోజులు నీటి సరఫరా ఇస్తారు. తరువాత నుంచి మళ్లీ కాలనీ వాసులు ఇబ్బందులు అధికారులు పట్టించుకోవడం లేదు. కాలనీలో వీధి కుళాయిలు వేయించి పైపులైన్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి పూర్తి స్థాయిలో మంచినీటి సరఫరా చేపట్టాలి.

– కడియాల కనకదుర్గ, 28వ వార్డు కౌన్సిలర్

సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎన్‌టిఆర్ కాలనీ వసుల ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తాం. నిత్యం పారిశుధ్య పనులు చేయించి, పైపులైన్ల లీకులు, అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

ప్రజా సమస్యలు పట్టించుకోరా..!

- తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యమా ?
- మున్సిపల్ అధికారులపై కౌన్సిల్ గరం గరం
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం



మున్సిపల్ సమస్యలపై ప్రశ్నిస్తున్న సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్. సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం, వీధిలైట్లు వెలుగక ప్రజల ఇక్కట్లు, అపారిశుధ్యం విలయ తాండవం జరుగుతున్నా మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడంలేదంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ గళమెత్తింది. పురపాలక సంఘం సర్వ సభ్య సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మట్లాడుతూ భాగ్య నగర్ గ్యాస్ కంపెనీ అధికారులను మభ్యపెట్టి పెద్దాపురం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన సొమ్ములను ఎగవేసిందని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చినా ఎందుకు నిర్లక్ష్యంమంటూ నిలదీశారు. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి వివరణ ఇస్తూ భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ మున్సిపాలిటీకి సుమారు రూ.48 లక్షలు చెల్లించాలన్నారు. తదుపరి వారికి అనుగుణంగా కోర్టు ద్వారా జీఓ తెచ్చుకోవడం వాళ్లు మున్సిపాలిటీకి సొమ్ములు చెల్లించలేదన్నారు. మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న మున్సిపల్ పార్క్ పిచ్చి తుప్పలతో ఉందని, మున్సిపల్ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ పైన, కింద షాపులకు ఒకే అద్దె నిర్ణయించడం సరి కాదన్నారు. పట్టణంలో కుక్కల సంతతి వృద్ధి కాకుండా కుని ఆపరేషన్లు జరపాలన్నారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, ఆకుల కృష్ణబాపూజీ, కడియాల కనకదుర్గ, గోకేడ అప్పారావు మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో నాలుగు రోజుల నుంచి మంచినీటి సరఫరాను సక్రమంగా చేయకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారులు మంచీ నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ స్థానిక జగనన్న కాలనీ లే అవుట్‌లో ట్యాంకు పగిలి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఎక్కడా చుక్క నీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పట్టణంలో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, దీనిపై అధికారులు స్పందించాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో సెంట్రల్ లైటింగ్‌కి నిధులు వెచ్చించినా సక్రమంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ ఆరెళ్ళి వీర్రాఘవులు మాట్లాడుతూ పాత పెద్దాపురం రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. పట్టణంలో పందులు బెడద ఎక్కువైందని దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ కనకదుర్గ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కాలనీలో మంచినీటి సరఫరా పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం వీధి కుళాయిలు వేయాలన్నారు. ట్యాంకుల ద్వారా వచ్చే మంచినీరు కింద వాళ్లకే సరిపోతుందని, కాలనీ వాసులకు మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక గొనీ కోనేరు, పాండవుల మెట్ట వద్ద కూడా సంపులు నిర్మాణం చేపడితే పట్టణ ప్రజలకు మంచినీటి అవస్థలు తగ్గుతాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పట్టణంలో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని ఇంజినీరింగ్ అధికారులు వీధిలైట్ల నిర్వహణ, పట్టణంలో పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలోని పలు రోడ్ల వద్ద పిచ్చి తుప్పలు పేరుకుపోయయని వెంటనే తుప్పలు తొలగించాలన్నారు. అనంతరం పలు అంశాలపై వాడివేడి చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రకాశరావు, మేనేజర్ జ్యోతిరాణి, ఏఈ సధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆయా విభాగాల అధికారులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు విడదాసరి రాజా, పెంటకోట సత్తిబాబు, ముప్పన శ్యామలాంబ, పేరింశెట్టి అంబిక, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ అత్యవసర సమావేశం

- వైస్ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహణ
- సునేత్రాదేవిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు
- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ సునేత్రాదేవిని ఇన్‌చార్జిగా నియమిస్తూ సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఎల నుంచి ఆదేశాల వచ్చాయని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తాను విదేశాలకు వెళుతున్న కారణంగా కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలకు అందుబాటులో ఉండనని ఇటీవల మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన డీఎంఏకు తెలియజేయడంతో పాటు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దాంతో ఆ వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో రిజర్వేషన్ ప్రకారం మహిళా వైస్‌చైర్మన్‌గా ఉన్న గోకిన సునేత్రాదేవికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తూ ఉత్వర్వులు రావడంతో ఆమె అధ్యక్షతన ఈ నెలలో అత్యవసర సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. అయితే గోకిన సునేత్రాదేవి అందుబాటులో లేక పోవడం వలన ఆమె వచ్చిన తరువాత మంగళవారం సాయంత్రం అజెండాపై సంతకాలు చేయించి కౌన్సిలర్లకు సమావేశం అజెండాలు అందజేస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై సొంత పార్టీకి చెందిన 25 మంది కౌన్సిలర్లు మే 15న అవిశ్వాసం తీర్మానాన్ని ఆమోదించారు. ఏప్రిల్ 2న 22 మంది సభ్యుల సంతకాలతో అవిశ్వాసానికి అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మే 15న అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కలెక్టరు అనుమతి ఇస్తూ ప్రత్యేకాధికారిగా ఆర్డీఓ మల్లిబాబును నియమించిన విషయం విధితమే. అవిశ్వాసం పెట్టే ముందుగానే చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించారు. దాంతో అవిశ్వాసం మెజార్టీ సభ్యులతో ఆమోదం పొందినా, అవిశ్వాస సమావేశానికి అధ్యక్షత వహించిన కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అధికారికంగా ప్రకటించలేదు. దాంతో గత రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరుగలేదు. ఈనెలలో కూడా కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం లేదని బావించిన తరుణంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవిని నియమిస్తూ ఆదేశాల రావడంతో 31న అత్యవసర సమావేశం జరుగుతుంది. పట్టణంలో అనేక అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు నిలిచిపోవడంతో వాటిని కౌన్సిల్ ఆమోదించాల్సి ఉందని కమిషనర్ తెలిపారు. వచ్చే నెలలో మరో రెండు సమావేశాలు ఏర్పాటు చేసిన పెండింగ్‌లో ఉన్న అన్ని పనులకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే రెండు కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో సభ్యులకు రావాల్సిన గౌరవ వేతనాలు కూడా నిలిచిపోయాయి. దాంతో ఈ నెలలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిసి సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దొరబాబు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు మంగళవారం కలుసుకున్నారు. విజయవాడ వెళ్లిన దొరబాబు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆస్తి పన్నుల్లో పేరు మార్పు ఇక సులభం

బోట్‌క్లబ్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు, ఆస్తి పన్ను పేరు మార్పునకు ఆటో మ్యూటేషన్ విధానం సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కమిషనర్ భావన మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో, ఆస్తి యజమానిపై పన్ను పేరు మార్పులకు జరుగుతున్న ఇబ్బందులు, జాప్యం తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఆటో మ్యూటేషన్ విధానం అమలు చేస్తుండగా, వచ్చిన ఫలితాలతో మొదటిగా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్‌లలో ఈ విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. దీంతో ఇకపై ఆస్తులు కొనుగోలు, అమ్మకాలు జరిగినపుడు పన్ను పేరుమార్పుకు కార్పొరేషన్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి, ఖాళీ స్థలాలపై ఉన్న పాత బకాయి చెల్లించి, పన్ను పేరుమార్పునకు సంబంధించి మ్యూటేషన్ చార్జీలు చెల్లించిన వెంటనే పన్ను పేరుమార్పు పత్రాలను ఎటువంటి కాలయాపన లేకుండా పొందవచ్చువచ్చునన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ సేవలను నగరప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రత్తిపాడు: మద్యం సేవించి వావాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నిందితులను మంగళవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, తొమ్మిది మందికి రూ.90 వేలు జరిమానా విధించారు. అన్నవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు స్టేషన్ల పరిధిలో అరెస్టు చేసిన తొమ్మిదికి మందికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.90 వేలు జరినామా విధించారన్నారు.

సారా రహిత ప్రాంతంగా గుడారిగుంట

కాకినాడ క్రైం: కాకినాడ మండలంలోని గుడారిగుంట ప్రాంతాన్ని సారా రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్టు కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం గుడారిగుంట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. నవోదయం 2.0కు విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను సారాకి దూరం చేస్తున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గుడారిగుంటలో సారా నిర్మూలించినట్టు ఆయన తెలిపారు.

క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



రెవెన్యూ అకాడమీ వద్ద క్రీడాకారులకు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ

సామర్లకోట: జూనియర్ హాకీ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాటు చేసిన రూములను ఆయన పరిశీలించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 12వ తేదీ వరకు కాకినాడలో జరుగనున్న జూనియర్ జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 200 మందికి సామర్లకోటలో రూములను కేటాయించారు. వివిధ రాష్ట్రాల నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చిన క్రీడాకారులను కేటాయించిన విశ్రాంతి భవనాలకు రెవెన్యూ అధికారులు తీసుకు రావలసి ఉంటుందని జేసీ చెప్పారు. ఈ మేరకు టీటీడీసీలో 80 మంది విశ్రాంతి తీసుకునే విధంగా ఏర్పాటు చేసిన బెడ్‌లు, బెడ్ సీట్లు, తలగడలు లేకపోవడంతో వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబుకు సూచించారు. రెవెన్యూ అకాడమిలో 80 మందికి కేటాయించగా కొన్ని రూములలోని బాత్ రూములకు డోర్లు లేకపోవడం, లైట్లు వెలగకపోవడాన్ని జేసీ గమనించి వాటిని సరి చేయాలన్నారు. అదే విధంగా విస్తరణ శిక్షణ కేంద్రంలో కేటాయించిన 40 బెడ్‌లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీసీలో ఎక్కువగా మొక్కలు తుప్పలు ఉండటం వలన పాములు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బాలురు, బాలికలకు కేటాయించిన బాత్ రూములను జేసీ పరిశీలించారు. క్రీడాకారులు గదుల్లో ఉన్నంత సమయం అక్కడ రెవెన్యూ సిబ్బంది ఉండాలన్నారు. కీడాకారులకు కేటాయించిన రూముల్లో కావలసిన సదుపాయాలు కల్పించడానికి నిధులు విడుదల చేశారన్నారు. స్థానిక టీటీడీసీలోని మెస్ నుంచి కాలసిన వారికి అల్పాహారం ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ మల్లిబాబు తెలిపారు. ముందుగా వచ్చిన క్రీడాకారులకు కాకినాడ నుంచి భోజనాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఆర్వోలు రాంజీ, లోవరాజు, ఆదినారాయణ, జానీ, రాజేష్, వెంకటలక్ష్మి, బాబీ పాల్గొన్నారు.

బెంగాలీల వైపు.. రైతుల చూపు..

- బెంగాలీ నాట్లతో తగ్గుతున్న భారం
- సాగులో విత్తనాలు, నారు, పెట్టుబడి ఆదా
- నియోజకవర్గంలో 12000 హెక్టార్లలో వంట సాగు



నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

కొత్తపల్లి: బెంగాలీ కూలీలతో పని చేయించుకుంటే ఖర్చులు తగ్గుతున్నాయి. తక్కువ నారుతో నాట్లు వేయడం, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయడం వారికి అలవాటు. వీరు పనిచేస్తే పెట్టుబడి, నారు ఆదా అవుతుంది. దీంతో వీరితో పని చేయించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాటు వారికి డిమాండ్ కూడా పెరిగింది.

పిఠాపురం నియోజకవర్గంలో రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ కూడా బెంగాలీ తరహాలో నాట్లు వేస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీంతో రైతులు బెంగలీ కూలీలను తీసుకొస్తున్నారు. ఇప్పటికే జట్లుగా వచ్చిన బెంగాలీలు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టు ప్రాతిపదికన రైతులతో మాట్లాడుకుటున్నారు. మండలంలో ఇప్పటికే 60 శాతం బెంగాలీ కూలాలు నాట్లు వేశారు. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలులో సుమారు 12000 హెక్టార్లలో వరి పంట సాగు జరుగుతుంది. కొత్తపల్లి మండలంలో సుమరు 7234మంది రైతులు 10454 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు.

లేత నారుతోనూ నాట్లు

రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి సుమారు 15 కిలోలు విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. లేత నారుతోనే నాట్లు వేయగలరు. వీరు వేసిన నాట్లు నాలుగైదు రోజుల్లో మూనలు తీరుగుతాయి. స్థానిక కూలీలు వేసిన నాట్లు మూనలు తిరగాలంటే పది రోజులు పడుతుంది. నాట్లకు స్థానిక కూలీలు ఆరుగురు అవసరైతే బెంగాలీ నలుగురు సరిపోతారు. వీరు ఎకరానికి 15 నుంచి 20 పోగుటు వాడితే స్థానికులు 45 పోగులకుపైన వినియోగిస్తారు. స్థానిక కూలీలతో పోలిస్తే బెంగాలీ నాట్లు వల్ల రైతులకు ఖర్చులు చాలా వరకు కలిసోస్తాయి. దిగుబడి అధికంగా వస్తోందని రైతులు చెబుతున్నారు.

దిగుబడి పెరిగింది



నేను వ్యవసాయం సుమారు 15 ఎకరాలను సాగు చేస్తున్నా. ముడేళ్లుగా బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నాను. వారు నేర్పుగా నాట్లు వేస్తారు. ఫలితంగా ఖర్చు తగ్గింది. చీడ పీడల బెడద తగ్గింది. ఎకరానికి దిగుబడి పెరిగింది. సాధారణ కూలీల కొరత తగ్గింది.

– జి.లక్ష్మణరావు వాకతిప్ప రైతు

ఖర్చు తక్కువ



బెంగాలీ నాట్లు విధానం చాలా బాగుంది. ఖర్చు విషయంలో ఆదిలోనే ముడొంతుల కుపైగా తగ్గిపోయింది. బెంగాలీ విధానంలో పూర్తిగా నారు కోరతను తగ్గించవచ్చు. అంతేకాక వారు వేసిన నాట్లు వల్ల చేలకు గాలీ వెలుతురు బాగా తగిలి చీడపీడలు ఉండవు.

– మాకా నాగేంద్ర వాకతిప్ప రైతు

10 నుంచి 20 శాతం నాట్లు పూర్తి



మండలంలో ఇప్పటివరకు సుమరు 10 నుంచి 20 శాతం నాట్లు పూర్తయ్యాయి. ఈ సంవత్సవం సుమరు 80 శాతం బెంగాలీ కూలీలతో నాట్లు వేసే అవకాశం ఉంది. బెంగాలీ నాట్ల వల్ల సాగు ఖర్చులు తగ్గడంతోపాటు పురుగు మందుల వాడకమూ తగ్గుతుంది. దీంతో ఎక్కువ మంది రైతుతు బెంగాలీ వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.

– జోగిరాజు, మండల వ్యవసాయ అధికారి, కొత్తపల్లి

బాలల హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి



బాలల హక్కులను వివరిస్తున్న దుర్గారాణి

పిఠాపురం: బాలల హక్కులపై బాలికలు అవగాహనతో ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. జల్లూరు మండల ప్రజా పరిషత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలతో పిఠాపురం ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాలల హక్కులైన జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు తదితర హక్కుల గురించి బాలికలు తెలుసుకోవాలన్నారు. లైంగిక వేధింపులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహనతో ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్ లైన్ 1098కి కాల్ చేయాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పని తీరు గురించి తెలిపి ఈ నెంబర్‌కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్య చక్రమ్మ, శాంతిలక్ష్మి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.